ఓటు హక్కు వినియోగించుకుంటే ఓపీ ఉచితం

» పేటకు చెందిన డాక్టర్ వినూత్న ఆలోచన

సూర్యాపేట, మే 11: ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారికి తమ ఆస్పత్రిలో ఉచితంగా ఓపీ చూస్తామని ఓ వైద్యుడు శనివారం ప్రకటించాడు. జిల్లా కేంద్రానికి చెందిన మన అమ్మ ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ సుధీర్ ఈ వినూత్న ఆలోచన చేశారు. ఓటు వేసి తన ఆస్పత్రికి వచ్చి వేలిపై సిరా గుర్తు చూపితే ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఉచితంగా ఓపీ చూస్తానని ప్రకటించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, మే 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి దివ్య క్షేత్రంలో శనివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. పాత గుట్ట ఆలయంలో స్వయంభువులకు నిత్య కైంకర్యాలను సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని శనివారం తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దర్శించుకున్నారు.




అస్తవ్యస్తంగా ఓటర్ల జాబితా

● ఒకే ఇంట్లో ఉంటున్న భర్త ఓటు ఒక బూత్‌లో, భార్య ఓటు మరో బూత్‌లో ● అత్తవారింటికి ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నా మారని ఓటు

ఓటర్ల జాబితాలు ఎన్నిసార్లు సవరించినా అస్తవ్యస్తంగా, చిత్రవిచిత్రంగా ఉంటున్నాయి. దీంతో పలువురు ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉందో తెలియక బేజారవుతున్నారు. ఒకవైపు ఓటింగ్ శాతం పెంచాలని ప్రచారం నిర్వహిస్తూ, మరోవైపు ఓటర్ల జాబితాలు తప్పుల తడకలుగా రూపొందిస్తే ఓటింగ్ శాతం ఎలా పెరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

● మోత్కూరు

మోత్కూరు మునిసిపాలిటీలో ఇంటి నెంబరు మారడంతో మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన నర్సిరెడ్డి ఓటరు గుర్తింపు కార్డులో ఇంటి నెంబరు మార్పుకోసం దరఖాస్తు చేసుకోగా ఆయన ఓటు ఒక వార్డులో ఆయన భార్య భారతమ్మ ఓటు మరో వార్డులో నమోదు చేశారు. నర్సిరెడ్డి ఓటు అంగడి బజారులోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లో ఉండగా, భార్య ఓటు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ బూత్‌లో ఉంది. బీఎల్‌వోలు (ఓటరు స్లిప్‌లు పంచే వారు) తమ వార్డు పరిధిలో ఉన్న వారికి మాత్రమే ఓటరు స్లిప్‌లు ఇచ్చి ఇతర వార్డుల్లో ఉన్న వారి ఓటు తమ వార్డులో ఉంటే వారికి ఓటరు స్లిప్‌లు ఇవ్వడం లేదంటున్నారు.


మోత్కూరులో ఒకే ఇంట్లో ఉంటున్న అన్నదమ్ముల ఓట్లు వేర్వేరు చోట్ల ఉన్న స్లిప్పులు

మోత్కూరులో కాయితాల విక్రమ్‌రెడ్డి ఓటు ఓ వార్డులో ఆయన తల్లిదండ్రులు, సోదరుడి ఓటు మరో వార్డులో ఉన్నాయి. వారి పోలింగ్ బూత్‌లు కూడా వేర్వేరుగా ఉన్నాయి. విక్రమ్‌రెడ్డికి వివాహంకాక ముందు ఆయన భార్య ఓటు కేసముద్రంలో ఉండగా, వివాహం జరిగిన తర్వాత మోత్కూరులో ఉంటున్నందున మోత్కూరుకు బదిలీ చేయమని దరఖాస్తు చేసుకున్నా బదిలీ కాలేదని చెప్పారు. ఇలానే ఒకే ఇల్లు, ఒకే కుటుంబానికి చెందిన పలువురి ఓట్లు వేర్వేరు చోట్ల ఉండటంతో ఓటర్లు ఇబ్బంది పడుతున్నారు. కొందరి ఓట్లు రెండేసి సార్లు ఉన్నాయి. గత మునిసిపల్ ఎన్నికల్లో కూడా భర్త ఓటు ఓ వార్డులో ఉంటే, భార్య ఓటు మరో వార్డులో ఉండటంతో అప్పట్లో వార్డులకు పోటీ చేసిన కౌన్సిలర్లు కూడా నానా ఇబ్బంది పడ్డారు. ఇక ముందైనా ఇంటి నంబరు ప్రకారం ఒకే ఇంటిలో ఉండే వారందరి ఓట్లు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

అందరి చూపు 'పోస్టల్'వైపు

● పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకున్న ఉద్యోగులు ● హోం ఓటింగ్‌లో వృద్ధులు, దివ్యాంగులు సైతం

నల్లగొండ, మే 11: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి పెద్ద ఎత్తున పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఈ ఓట్లు ప్రభావం చూపే అవకాశం ఉన్నాయి. గతంలో ఐదేళ్ల క్రితం పోస్టల్ బ్యాలెట్ చేతికి వచ్చి తమకు తీరిక ఉన్నప్పుడు ఓటు వేసేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించేది. కానీ గత రెండు దఫాలుగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు శిక్షణ సమయంలో శిక్షణ పొందే ప్రాంతంలోనే ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో పోస్టల్ బ్యాలెట్‌కు కూడా పెద్దఎత్తున వినియోగించుకున్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి, 8వ తేదీ వరకు సమయం ఇవ్వగా ఉద్యోగుల కోర్కె మేరకు 10వ తేదీ వరకు పొడిగించారు. దీంతో ఉద్యోగస్తులంతా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దేవరకొండ నియోజకవర్గంలో 1,155 మంది ఉద్యోగులు, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 1,356 మంది, మిర్యాలగూడ నియోజకవర్గంలో 2,465 మంది, హుజూర్‌నగర్‌లో 1,707మంది, కోదాడ నియోజకవర్గంలో 2274మంది, సూర్యాపేటలో 3071మంది, నల్లగొండ నియోజకవర్గంలో అత్యధికంగా 4744మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేశారు. ఇందులో అధికంగా ఉపాధ్యాయులు, పోలీస్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు ఉన్నారు. ఇదిలా ఉంటే 85 ఏళ్లు దాటిన వృద్ధులతోపాటు దివ్యాంగులు 2,107మంది తమ ఓటు హక్కును హోం ఓటింగ్ ద్వారా వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు కూడా అత్యధికంగా పోల్ అవడంతో అభ్యర్థుల్లో సైతం ఆందోళన నెలకొంది.


నల్లగొండలో హోం ఓటింగ్‌లో ఓటు వేసిన దివ్యాంగురాలు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

తిప్పర్తి, మే 11: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను తిప్పర్తిలో పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా లింగసముద్రం మండల కేంద్రానికి చెందిన మాచపల్లి మాల్యాద్రి అనే వ్యాపారి తెలంగాణలోని నకిరేకల్ పట్టణంలో నిమ్మకాయల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో బొలేరో వాహనంలో 2,400 క్వాటర్లు సుమారు 432 లీటర్ల మద్యాన్ని (రూ.2.70లక్షల విలువైన) వాహనంలో వేసి, అనుమానం రాకుండా మద్యం బాక్సుల పైనుంచి నిమ్మకాయలను పేర్చుకొని తిప్పర్తి మీదుగా మిర్యాలగూడ వైపు వెళ్తున్నాడు. విషయం తెలుసుకున్న తిప్పర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనం ఆపి తనిఖీ చేయగా మద్యం సీసాలు బయటపడ్డాయి. ఈ మద్యం తరలిస్తున్న వాహనం ఓనర్, డ్రైవర్ వంగూరి కర్ణాకర్, వ్యాపారి మాల్యాద్రిపై కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేసినట్లు తిప్పర్తి ఎస్ఐ డి.రాజు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామ్మూర్తి, రైటర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.


తిప్పర్తిలో పట్టుబడిన మద్యం

మేళ్లచెర్వు: నిబంధనలకు విరుద్ధంగా వాహనంలో తరలిస్తున్న 119 కాటన్ల మద్యాన్ని మేళ్లచెర్వు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామాపురం గ్రామంలో శనివారం వేకువజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా బొలెరో వాహనం కనిపించటంతో పోలీసులు మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని వెంబండించి పట్టుకున్నారు. కాగా.. ఈ వాహనం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన గాదె జానితో పాటు చెరుకుపాలెం గ్రామానికి చెందిన దూళం గోపిరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.8లక్షలు ఉంటుందన్నారు.





రేపు రత్యా తండాకు కేసీఆర్ రాక

దేవరకొండ, మే 11: కేసీఆర్ ఈ నెల 12న దేవరకొండ మండలం రత్యా తండాకు రానున్నారు. రత్యాతండా మాజీ సర్పంచ్, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తండ్రి కసీలాల్ శనివారం మృతి చెందారు. కసీలాల్ అంత్యక్రియల్లో కేసీఆర్‌తోపాటు హరీష్ రావు పాల్గొంటారు.



నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య

నల్లగొండ టౌన్, మే 11: నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ శ్రీనివాస కాలనీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ శ్రీనివాస కాలనీకి చెందిన సయ్యద్ వలీ(40) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్నేళ్ల క్రితం ఆయనకు వివాహంకాగా పిల్లలుకాలేదు. అతని భార్య ఇంటి దగ్గరే ఉంటుండగా, కొన్ని రోజులుగా భార్య, భర్తలకు తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సయ్యద్ వలీ భార్య తరఫు బంధువులకు ఈ విషయం చెప్పడంతో శనివారం రిజ్వాన్, నజీర్, సాజిద్‌లు కలిసి సయ్యద్ వలీపై కర్రలతో దాడి చేయడంతో వలీ అక్కడికక్కడే మృతి చెందాడు. సయ్యద్ వలీ కుటుంబ సభ్యుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.


సయ్యద్ వలీ మృతదేహం

బైక్ షోరూంలో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నల్లగొండ, మే 11: జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఓ బైక్ షోరూంలో శనివారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.కోటి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పోలీసులు, అగ్నిమాపక అధికారుల వివరాల ప్రకారం.. వాహనాల స్పేర్ పార్ట్స్ ఉంచే ప్రాంతంలో తొలుత షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. షోరూంలు ప్లాస్టిక్ వస్తువులు, స్పేర్ పార్ట్స్, ఆయిల్ డబ్బాలు, వాహనాలకు చెందిన ఇతర పరికరాలు ఉండటంతో మంటలు వేగంగా వ్యాప్తిచెందాయి. మంటలు ఎంతకూ అదుపులోకి రాకపోవడంతో నకిరేకల్ నుంచి మరో అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు దాదాపు రెండు గంటల అనంతరం మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ సందర్భంగా డీఎస్పీ శివరాంరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. షోరూం యజమానులు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామన్నారు. మంటలను అదుపులోకి తీసుకరావడానికి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సందేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నకిరేకల్ అధికారి భీముడు, నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారి రాంనర్సయ్య, బిక్కు, ఫయాజ్‌ఖాన్, అయన్న, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, జహీర్, జానిమియాలు కృషి చేశారని అధికారులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

నార్కట్‌పల్లి, మే 11: నడుస్తున్న రైలు నుంచి జారి రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం నార్కట్‌పల్లి శివారులో జరిగింది. నల్లగొండ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డి.రజిత తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి-చిట్యాల రైల్వేస్టేషన్ మధ్యన 56/0-1 కి.మీ వద్ద రైలు పట్టాల పక్కన మృతదేహం పడి ఉన్నట్లుగా సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి చూడగా 40 ఏళ్ల వయస్సున్న వ్యక్తి రైలు కిందపడి మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. సికింద్రాబాద్-గుంటూరు మార్గంలో వెళ్లే రైలు నుంచి జారి పడి మృతిచెందానట్లుగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రజిత పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి రూరల్, బీబీనగర్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ జె.కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్, పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య బొమ్మాయిపల్లిలో కాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపునకు వెళ్తున్న రైల్వే మార్గంలో గుర్తు తెలియని రైలు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. మృతుడు సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉండి, శరీరంపై బూడిద రంగు నైట్ పాయింట్, బ్లాక్ టీషర్ట్ ఉన్నాయి. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రపరిచినట్లు, వివరాలకోసం సెల్:9848223169ను సంప్రదించాలన్నారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తులు

భువనగిరి అర్బన్, మే 11: గంజాయితో ఉన్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాధాకిషన్ తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని గంజాయి అడ్డాలపై శనివారం దాడులు చేయగా, యాదగిరిపల్లికి చెందిన ముగ్గురి 84 గ్రాముల గంజాయిని ఉన్నట్లు గుర్తించగా సదరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.





ముగిసిన ప్రచారం

- నిలిచిన ప్రచార రథాలు, ఆగిన మైకులు
- చివరి రోజు ఇంటింటి ప్రచారాలు, ర్యాలీలతో జోష్
- పోల్ మేనేజ్‌మెంట్‌లో తలమునకలైన పార్టీలు, అభ్యర్థులు

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి తెరపడింది. రాష్ట్రంలో నాలుగో విడతగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఈనెల 13న జరగనుంది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలకు 48గంటల ముందుగా ప్రచారాన్ని ముగించాలి. దీంతో శనివారం సాయంత్రం ఐదు గంటలకు అధికారిక ప్రచారానికి పార్టీలు ముగింపు పలికాయి. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. శనివారం సాయంత్రం వరకు హోరాహోరీగా ప్రచారం సాగింది. ఆ తరువాత ప్రచార రథాలు, మైకులు ఆగిపోయాయి. పార్టీల కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిలిపివేశారు. ప్రచార ఘట్టం ముగియడంతో అభ్యర్థులు, పార్టీల నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఓటర్లను పోలింగ్‌కు రప్పించడంపైనే ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ప్రచార ఘట్టం ముగియడంతో రాజకీయ పార్టీలు కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించాయి. పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలను విశ్లేషించుకున్న నాయకులు, కార్యకర్తలు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించడంపై దృష్టి సారించారు. స్థానికంగా నివాసం లేనివారికి ఫోన్ల ద్వారా ఓటు వేయడానికి రమ్మని అభ్యర్థిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్, ఇతర నగరాల్లో ఉద్యోగులు, జీవనోపాధికి వెళ్లిన వారిపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. బూత్‌ల వారీగా అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ శాతాన్ని పరిగణనలోకి తీసుకొని ఈసారి ఓటింగ్ తగ్గకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా పోటీ తీవ్రత లేకపోవడం, అభ్యర్థులు నేరుగా ఓటర్లతో అనుసంధానం కాలేకపోవడం వంటి పలు కారణాలు ఓటింగ్ శాతాన్ని ప్రభావితం చేస్తాయని భావిస్తున్నారు. బూత్‌స్థాయిలో కార్యకర్తలద్వారా ఓటర్లకు నమూనా బ్యాలెట్లను చూపిస్తూ చివరిదశ ప్రచారం సాగించారు. చివరలో ఓటర్లకు నజరానాలు ఇస్తారా? లేదా? అనే అంశంపై కొన్ని వర్గాల్లో ఆసక్తి కనిపిస్తోంది. ప్రధాన పార్టీల క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే అభ్యర్థుల ద్వారా, ప్రధాన నాయకుల ద్వారా పంపకాలపై ఆరా తీస్తున్నారు. ఇప్పటివరకు ఈ అంశాలపై ఎక్కడా స్పందించని నాయకులు, చివరకు ఎలా వ్యవహరిస్తారనేది చర్చగా మారింది.



ప్రచారం ముగియడంతో భువనగిరిలో వాహనానికి ఫ్లెక్సీని తొలగిస్తున్న యజమాని

చివరి రోజు ర్యాలీలు, ఇంటింటి ప్రచారాల హోరు

ఎన్నికల ప్రచారంలో చివరి రోజు ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలు హోరెత్తాయి. నల్లగొండ లోక్‌సభ అభ్యర్థులు కుందూరు రఘువీర్‌రెడ్డి(కాంగ్రెస్), కంచర్ల కృష్ణారెడ్డి(బీఆర్ఎస్), శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ) ర్యాలీల్లో పాల్గొని రోడ్‌షోలు నిర్వహించారు. భువనగిరిలో బరిలో ఉన్న చామలకిరణ్ కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), క్యామ మల్లేశ్ (బీఆర్ఎస్), డాక్టర్ బూరనర్సయ్య గౌడ్ (బీజేపీ) సైతం ఆయా ప్రాంతాల్లో ర్యాలీల్లో పాల్గొనడంతో పాటు, ఇంటింటి ప్రచారం సాగించారు. అభ్యర్థుల తరపున ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, కీలక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బూత్ స్థాయి వరకు ఎక్కడికక్కడ విస్తృతంగా ప్రచారం కొనసాగించారు. ప్రధానంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి నమూనా బ్యాలెట్లను ప్రదర్శించి అభ్యర్థుల గుర్తులను ఓటర్లకు వివరించే ప్రయత్నం చేశారు.

పట్టు నిలుపుకొనేందుకు యత్నం

(ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నేతలు తమ పట్టును నిలుపుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు నెలరోజుల పాటు అభ్యర్థులతోకలిసి పల్లెల్లో ప్రచారాన్ని హోరెత్తించారు. వాడవాడల్లో పార్టీ నేతల ప్రచారంతో ఎన్నికల సందడి నెలకొంది. ప్రచారపర్వం ముగియడంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు రహస్య ప్రచారానికి తెరలేపనున్నారు. అభ్యర్థులు గ్రామాల్లోని కాలనీ సంఘాలు, పలుకుబడి ఉన్న నేతలను సంప్రదిస్తున్నారు. కరపత్రాలు, బ్యాలెట్ నమూనా పత్రాలను చేతపట్టుకుని తమకే మద్దతు తెలపాలని కోరుతున్నారు.

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఇబ్రహీంపట్నం, జనగామ, ఆలేరు, భువనగిరి, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోకవరాల్లో అభ్యర్థులు సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం, రోడ్‌షోలు నిర్వహించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులంతా తెల్లవారుజామున నుంచే ప్రచారాన్ని నిర్వహించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విందుభోజనాలు కూడా ఏర్పాటు చేశారు. చివరి రోజు భువనగిరి పట్టణంలో ప్రధాన పార్టీలన్నీ బల ప్రదర్శన చేశాయి. అభ్యర్థులంతా పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని పార్టీలకు చెందిన అగ్రనేతలు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఆశతో అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల మధ్య నువ్వా? నేనా? అనేలా ప్రచారాన్ని ఊదరగొట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం ప్రచారాన్ని ఉధృతం చేశారు. పతుల కోసం సతులు ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి బొట్టుపెట్టి మద్దతు కోరారు. బహిరంగ ప్రచారానికి తెరపడటడంతో కుల సంఘాలు, యువతను, గ్రామాల్లో, పట్టణాల్లో పలుకుబడి ఉన్న నాయకులను తమవైపునకు తిప్పుకునేందుకు అభ్యర్థులు వ్యూహరచన చేస్తున్నారు. దీంతో మండలాల్లో రోజురోజుకూ రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో విజయం కోసం పలువురు అభ్యర్థులు డబ్బు కుమ్మరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

కాయ్ రాజా కాయ్



- ఏపీ అసెంబ్లీ ఎన్నికల వేళ సరిహద్దుల్లో బెట్టింగ్‌ల జోరు
- రూ.5వేల నుంచి రూ.20లక్షల వరకు బెట్టింగ్


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికలపై రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల్లో ఉత్కంఠత నెలకొంది. గెలుపు ఎవరిని వరిస్తుందోనని టీడీపీ, వైసీపీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే ఏప అసెంబ్లీ ఎన్నికల వేళ తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. రూ.5వేల నుంచి రూ.20లక్షల వరకు ఈ బెట్టింగ్‌లు నడుస్తున్నట్లు సమాచారం.

- కోదాడ



ఏపీ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా, వైసీపీ ఒంటరిగా పోటీచేస్తోంది. ఈనెల 13న ఏపీలో పార్లమెంట్, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరుగుతుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో ఇక్కడ గెలుపుపై ఏపీతోపాటు తెలంగాణలో సైతం ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌లకు తెరలేసింది. టీడీపీ అభిమానులు సైకిల్ గుర్తుపై, వైసీపీ అభిమానులు ఫ్యాన్ గుర్తు గెలుపుపై బెట్టింగ్‌లు వేస్తున్నారు. ఎన్నికలకు, లెక్కింపునకు 20రోజుల సమయం ఉండటంతో, బెట్టింగ్‌కు పాల్పడే వారు మాట తప్పకుండా గెలిచేవారికి సొమ్ము ఇచ్చేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందుకు మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. అతడి సమక్షంలో రూ.100 బాండ్ పేపర్‌పై సంతకాలు చేసి, గెలిచినవారికి సొత్తు ఇచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇందులో మధ్యవర్తికి రూ.100కు 2.5శాతం కమీషన్ ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నట్లు వినికిడి. ఇప్పటికే తెలంగాణలో ఉన్న ఏపీ ఓటర్లు ఓటు వేసేందుకు రెండు రోజులుగా సొంత గ్రామాలకు పెద్ద సంఖ్యలో బస్సులు, రైల్లు, కార్లలో బయలుదేరారు. జాతీయరహదారి-65పై వాహనాల రద్దీ ఏర్పడింది. దీంతో ఓటింగ్ శాతం భారీగా ఉంటుందని, రెండు పార్టీల విజయం నల్లేరు మీద నడకలా ఉంటుందని ఆశావహులు వారి స్థాయికి తగ్గట్టుగా రహస్యంగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు సమాచారం. టీడీపీ కూటమి అభిమానులు ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతతో విజయం వరిస్తుందని, వైసీపీ అభిమానులు నవరత్నాలు విజయానికి చేరువ చేస్తాయనే ధీమతో బెట్టింగ్‌లకు సిద్ధమయ్యారు. దీంతో జూన్ 4న ఫలితాలతో బెట్టింగ్‌రాయుళ్ల భవితవ్యం తేలనుంది.

ఎన్నికల వేళ..మద్యం జోరు



కోదాడ, మే 11: ఎన్నికల వేళ జోరుగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. వేసవి అంటేనే మద్యం ప్రియులు లిక్కర్ కన్నా, చల్లని బీర్లను ఇష్టపడతారు. దీంతో కూల్, కూల్ బీర్లు దొరక్క మద్యం ప్రియులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుకాణదారులతో ఘర్షణకు దిగుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలు రోజు, రోజుకూ పెరుగుతున్నాయి. అందుకు మద్యం అమ్మకాల గణాంకాలను నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ నెల 1వ తేదీ నుంచి 9వరకు ఉమ్మడి జిల్లాలో రూ.87.26కోట్ల విక్రయాలు జరిగాయి. అంటే నిత్యం రోజుకు రూ.9.69కోట్ల విక్రయాలు జరిగాయి. ప్రభుత్వం బీర్లను సరఫరా చేసి ఉంటే విక్రయాలు రెట్టింపు ఉండేవని వ్యాపారులు చెబుతున్నారు. కాగా ఈ నెల 13న ఎన్నికల నేపథ్యంలో 12, 13న రెండు రోజులు మద్యం దుకాణాలకు సెలవు ప్రకటించింది. దీంతో మద్యం ప్రియుల డిమాండ్ దృష్ట్యా ఇప్పటికే మద్యాన్ని డిపోలనుంచి దుకాణాలకు పంపించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే మద్యం దుకాణాదారులు ప్రభుత్వ సెలవులు ప్రకటించినప్పుడు తాము నష్టపోతున్నామని, సెలవురోజుల్లో లైసెన్స్ వెనక్కు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

- మే 1 నుంచి 9 వరకు రూ.87.26కోట్ల విక్రయాలు
- ఎన్నికల నేపథ్యంలో రెండు రోజులపాటు మద్యం అమ్మకాల నిలిపివేత
- ఇప్పటికే దుకాణాలకు చేరిన మద్యం
- రేషన్‌తో మద్యం ప్రియులకు సరిపడా అందని బీర్లు
- రూ.4.91కోట్ల లైసెన్స్ ఫీజు వెనక్కు ఇవ్వాలంటున్న దుకాణదారులు
- ఉమ్మడి జిల్లాలో 299 మద్యం దుకాణాలు 95,963 లిక్కర్, బీర్లు లిఫ్టు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 299 మద్యం దుకాణాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 299 మద్యం దుకాణాలున్నాయి. ప్రభుత్వం నల్లగొండ, యాదాద్రి భువనగిరి డిపోల నుంచి ఈ నెల 1నుంచి 9వరకు ఆయా దుకాణాలకు రూ.87.26కోట్ల విలువైన 95,963 లిక్కర్, బీర్ల కేసులను ఎగుమతి చేసింది. ఎన్నికల తేదీ, సెలవులు, మద్యం డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 8వ తేదీన ఒక్కరోజే నల్లగొండ, యాదాద్రి భువనగిరి డిపో పరిధిలో రూ.13.68కోట్ల విలువైన 15,045 లిక్కర్ కేసులు, 23,187 బీర్ల కేసులను లిఫ్టు చేసి, దుకాణాలకు పంపారు.



సెలవులతో రూ.4.91కోట్ల లైసెన్స్ వాపసు ఇవ్వాలి

సాధారణంగా గాంధీ జయంతి, జనవరి 26, ఆగస్టు 15న మద్యం దుకాణాలకు సెలవు. ప్రభుత్వం ఇచ్చే ఐచ్ఛిక దినాల్లో తాము చెల్లించిన లైసెన్స్ ఫీజు వెనక్కు ఇవ్వాలని దుకాణాదారులు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి ఏపీలో మద్యం దుకాణాల కేటాయింపు టెండర్ల ద్వారా జరిగేది. టెండర్లలో ఎవరు ఎక్కువ కోడ్ చేస్తే వారికి దుకాణం దక్కేది. ఆ క్రమంలో ప్రభుత్వ అధికారిక సెలవులు మినహాయిస్తే, ప్రభుత్వం ఇచ్చే ఐచ్ఛిక సెలవు రోజుల్లో దుకాణానికి చెల్లించిన ఫీజులో రోజుకు ఎంత పడుతుందో అంతా, ప్రభుత్వానికి చెల్లించే చివరి ఇన్‌స్టాల్‌మెంట్ తగ్గించుకొని తీసుకొనేది. డ్రా పద్ధతి వచ్చాక ఐచ్ఛిక సెలవు దినాలకు మినహాయింపు ఇవ్వకుండా మొత్తం ఫీజును ప్రభుత్వం తీసుకుంటుంది.ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కో వైన్ షాపునకు వార్షిక ఫీజు రూ.60లక్షలు. మునిసిపాలిటీ పరిధిలో రూ.65లక్షలు వసూలు చేస్తుంది. ఆ చొప్పున రోజుకు ఒక్కో దుకాణంపై రూ.16,438 చెల్లించాలి. ప్రభుత్వం ఎన్నికలు, ఇతరత్ర సెలవులిచ్చినప్పుడు తాము వ్యాపారం చేయకుండా ఫీజు భరించాల్సి వస్తుందంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమయం లో రెండు, ప్రసుత్తం ఎన్నికలకు రెండు, జీపీ, మునిసిపాలిటీ, ఇతర సెలవు దినాలు రెండు మొత్తంగా సంవత్సరంలో 10 రోజులు సెలవులు ప్రకటిస్తుంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 299 దుకాణాల్లో ఒక్కో రోజుకు రూ.16,438 చొప్పున, రోజుకు రూ.49.14లక్షలు, 10 రోజులకు రూ.4,91,49,000 భరించాల్సి వస్తుందని వాపోతున్నారు. భారం పడకుండా ప్రభుత్వానికి చెల్లించే చివరి ఇన్‌స్టాల్‌మెంట్ ఫీజు భారాన్ని తగ్గించాలని వ్యాపారులు కోరుతున్నారు. అంతేగాక ప్రభుత్వడిమాండ్ సరిపడా మద్యాన్ని సరఫరా చేయాలని సూచిస్తున్నారు.



మోదీ గెలిస్తే దేశానికే ప్రమాదం

- ఇండియా కూటమిని అధికారంలోకి తేవాలి
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 11: మోదీ గెలిస్తే దేశానికే ప్రమాదమని, అందుకు ఇండియా కూటమిని అధికారంలోకి తేవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, వామపక్ష నాయకులతో కలిసి శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు లౌకిక పార్టీలు ఏకమై ఇండియా కూటమిగా జతకట్టాయన్నారు. కూటమిని గెలపించి దేశాన్ని రక్షించాలని కోరారు. వామపక్ష పార్టీలు సమష్టిగా కృషి చేసి కూటమి అభ్యర్థులను గెలపించాలన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం అధికంగా నమోదయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్న ప్రధాని మోదీ, మతం పేరుతో ప్రజలను మరోమారు మోసం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. మత విద్వేశాలను రెచ్చగొట్టి విభజన పాలన చేస్తున్నారన్నారు. బీజేపీ జిమ్మిక్కులను దేశ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ధీరావత్ స్కైలాబ్‌నాయక్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్, పొదిల శ్రీనివాస్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, గాయం ఉపేందర్‌రెడ్డి, నీరుకంటి నారాయణ, శేఖర్‌రెడ్డి, బాలు, పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ర్యాలీలో పాల్గొన్న నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్, ఎమ్మెల్యే బీఎల్ఆర్, తదితరులు

వాడవాడలా విస్తృత ప్రచారం

పట్టణంలోని వాడవాడలా తిరుగుతూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని సీతారాంపురం, నెహ్రూనగర్ తదితర కాలనీల్లో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కౌన్సిలర్లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో చీదళ్ల సత్యవేణి, శ్రీనివాస్, పత్తిపాటి సంజాత, నవాబ్, సైదిరెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు, యువతకు ఉపాధే లక్ష్యం

- ఆర్ఆర్ఆర్ వెంట పరిశ్రమల కారిడార్
- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, మూసీ ప్రక్షాళన పూర్తిచేస్తాం
- కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదాద్రి, మే 11(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు, యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయమని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం భువనగిరిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.500కోట్లు వెచ్చించి బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పనులు పూర్తిచేసివుంటే ఈ ప్రాంత సస్యశ్యామం అయ్యేదని, కానీ సీఎం కేసీఆర్ దీన్ని పట్టించుకోదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తికాకముందే కరువు తెచ్చిందని కేసీఆర్ విమర్శించారని, పదేళ్ల పాలనలో పట్టించుకోనందుకే ఈ పరిస్థితులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదిగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా రూ.2లక్షల రుణమాఫీ, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే యుద్ధప్రాతిపదిక వీటిని పూర్తిచేస్తామన్నారు. రూ.50వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపడతామన్నారు. జాతీయ రహదారులు ఉన్న ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు నిర్మిస్తామని, ప్రతీ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల, రెండుమూడు మండలాలకు ఒక జూనియర్ కళాశాల ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానన్నారు. ట్రిపుల్‌ఆర్ వెంట పరిశ్రమల కారిడార్‌ను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే సీఎం రేవంత్‌రెడ్డి 17కులాలకు సంబంధించిన కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని అన్నారు. బీజేపీ పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణను పట్టించుకోలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల కుంభకోణాలకు పాల్పడినా నిలువరించలేదన్నారు. ఎయిమ్స్ విభజన హామీల్లో భాగమని, కానీ మేమే తెచ్చామని కొందరు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. 20ఏళ్లుగా ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో పనిచేసినందుకు పార్టీ గుర్తించి ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించిందన్నారు. ప్రచారంలో తన దృష్టికి చాలా అంశాలు వచ్చాయని, వాటిని ముఖ్యమంత్రికి వివరించానని తెలిపారు. భువనగిరి ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత, నాయకులు కిరణ్‌యాదవ్, శ్యాంగౌడ్, పింగళిరెడ్డి, రవికుమార్, పాల్గొన్నారు.



భువనగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న నాయకులు

సూర్యాపేటటౌన్, మే 11: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం మాస్‌లైన్ పార్టీ నుంచి సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీలో చేరిన వీరబోయిన రమేష్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డుశంకర్, కునుకుంట్ల సైదులు, దేశోజు మధు, సామ నర్సిరెడ్డి, పుల్లూరి సింహాద్రి, పెద్దింటి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పశ్యపద్మ

సూర్యాపేటటౌన్, మే 11: పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పశ్యపద్మ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసిందన్నారు. దేశంలో మతం పేరుతో బీజేపీ ప్రజలను విభజిస్తూ రాజకీయ లబ్ధి పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డ వెంకటయ్య, మండారి డేవిడ్‌కుమార్, దండ వెంకటరెడ్డి, సూర్యనారాయణ, కంబాల శ్రీనివాస్, మూరగుండ్ల లక్ష్మయ్య, వెంకటేశ్వరరావు, బొడ్డు శంకర్, కోటయ్య, ఎర్ర అఖిల్ కుమార్, బూర వెంకటేశ్వర్లు, నిమ్మల ప్రభాకర్, బచ్చలకూరి రాంచరణ్, కునుకుంట్ల సైదులు, వేల్పుల వెంకన్న, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మోదీ ప్రభుత్వం రావడం ఖాయం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కోదాడటౌన్, మే 11: కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం రావడం ఖాయమని బీజేపీ కోదాడ పట్టణ అధ్యక్షుడు సాతులూరి హనుమంతరావు అన్నారు. పట్టణంలో శనివారం ప్రచారం కొనసాగించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లకు పైగా గెలుచుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోఆర్డినేటర్ పెంద్ర లక్ష్మయ్య, రాయల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి పాటుపడింది కేసీఆరే

సూర్యాపేటటౌన్, మే 11: కార్మికుల సంక్షేమానికి పాటుపడిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకేంద్రంలోని శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలో కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం ధాన్యాగార బండారంగా మారిందని, ప్రస్తుతం కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో నీటిసమస్య, కరెంట్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేష్‌యాదవ్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ, నాయకులు దరావత్ శివరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు కాపాడుకోవాలి : శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

హుజూర్‌నగర్ రూరల్, మే 11 : సమాజంలో మాదిగల హక్కులు కాపాడుకోవాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ కోరారు. పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని హక్కులను కాపాడుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల హక్కుల సాధనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కస్తాల శ్రావణ్, కస్తాల సైదులు, శోభన్, వీరబాబు, నరేష్, కొండయ్య, సురేందర్ పాల్గొన్నారు.

టీఎస్ఆర్‌జేసీ ఫలితాల్లో కోదాడ విద్యార్థుల ప్రతిభ

కోదాడ రూరల్, మే 11: తెలంగాణ గురుకులాల్లో ఇంటర్ విద్య కోసం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్ష టీఎస్ఆర్‌జేసీ ఫలితాల్లో మండలంలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో 160మార్కులకు యలక మిథున్‌సాయి 125/160, షేక్ రేహన్ 112, వినుకొండ ప్రవీణ్ 107, షేక్ షాహిద్ పాషా 104, వట్టికూటి సంజయ్ 100 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు అభినందించారు.

సింగారెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు

కోదాడ రూరల్, మే 11: మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన సింగారెడ్డి అచ్చిరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ హిమబిందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇర్ల సీతారాంరెడ్డి, లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నాగారం, మే11: ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసులు వావానాల తనిఖీలు ముమ్మరం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ఐదు గంటలకే ముగియడంతో పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బులు మద్యం పంపిణీ చేసే అవకాశం ఉన్నందున మండలంలో ప్రధాన రహదారి 365-బి పై వచ్చే వావనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు నాగారం ఎస్ఐ పి. వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, డబ్బులు పంచుతున్నట్లు సమాచారం అందిస్తే వాహనాలను పట్టుకొని సీజ్ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం

హుజూర్‌నగర్, మే 11: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణలోని సమస్యలు పరిష్కారమవుతాయని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. పట్టణంలోని మంత్రి ఉత్తమ్ కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిశెట్టి రవికుమార్‌తో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీగా రఘువీర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గెల్లి రవి, భాస్కర్, సతీష్, వీరయ్య, ఖలీల్‌బాబా, అశోక్, మహేష్, మీరా పాల్గొన్నారు. మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఈడ్పుగంటి సుబ్బారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

నేరేడుచర్ల: మండల పరిధిలోని రేశ్వారిగూడెం, బక్కయ్యగూడెం గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకుడు కొణతం చిన్నవెంకటరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, కట్టా రామారావు, సోమయ్య, అనంతరెడ్డి, నాగరాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, రామనర్సు, కృష్ణారావు, వెంకటయ్య, మీరా, వెంకన్న, రంజాన్ ఉన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని బీక్యాతండాకు చెందిన 500 కుటుంబాలు శనివారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఇర్ల సీతారాంరెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌కు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నా, చావా కిరణ్మయి, ఎండీ. అజీజ్ పాషా, యల్లావుల రాములు, అట్లూరి మంజులహరిబాబు, షేక్ సైదా, వల్లబుదాసు కృష్ణ, యల్లమ్మ, గుండు వెంకటేశ్వర్లు, రమేష్, మోయిన్, జక్కుల వెంకయ్య, ఇట్టిమళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోతె: మండల పరిధిలోని నేరేడువాయి, గోపతండా, తుమ్మగూడెం, నర్సింహాపురం గ్రామాల్లో ఎంపీపీ ముప్పాని ఆశ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, కీసర సంతోష్‌రెడ్డి, ఫైనంపాటి గుర్వారెడ్డి, నూకల మదుసూదన్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, ముదిరెడ్డి మదుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



గరిడేపల్లి : తాళ్లమల్కాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మద్దతుగా తిరుపతి దేవస్థానం కమిటీ సభ్యుడు, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని విఘ్నేశ్వరస్వామి టెంపుల్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇందిర సెంటర్‌లో రోడ్డుకార్నర్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్‌రెడ్డి, యరగాని నాగన్న, ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, జక్కుల వీరయ్య, కాలువ శ్రీనివాసరావు, పల్లె వెంకటరెడ్డి, నాగారపు పాండు, సాముల శివారెడ్డి, నర్సింగ్ వెంకటేశ్వర్లు, నారపరాజు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్: బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ప్రచారంతో ప్రజలను మభ్య పెడుతున్నాయని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్, 3వార్డుల్లో కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. పదేళ్ల కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌లు అభివృద్ధిని విస్మరించాయన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముదిరెడ్డి రమణారెడ్డి, పూర రామూర్తియాదవ్, షఫిఉల్లా, నిమ్మల వెంకన్న, జ్యోతి కర్ణాకర్, దారోజు జానకిరాములు, బాస్కర్‌నాయక్, సైదిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరుగ్యారెంటీలను అమలు చేస్తున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కొప్పుల వేణారెడ్డి, శనగాని రాంబాబుగౌడ్ పాల్గొన్నారు.



పటేల్ రమేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కార్యకర్తలు

మేళ్లచెర్వు: మండలకేంద్రంలోని యాదవ సంఘానికి చెందిన పలువురు నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో హుజూర్‌నగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ముగ్గిమేకల బసవయ్య, జనిగ శ్రీను, వీరబాబు, బత్తుల వెంకటస్వామి, కాకునూరి భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, రామకృష్ణారెడ్డి, శంబిరెడ్డి, శంకర్‌రెడ్డి ఉన్నారు.

గరిడేపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి బల పర్చిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి కోరారు. మండలంలోని తాళ్లమల్కాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ పయిడిమర్రి రంగనాథ్, కటకం రమేష్, పోకల వెంకటేశ్వర్లు, షేక్ యాకుబ్, మండవ వెంకటేశ్వర్లు గౌడ్, షేక్ చాంద్‌మియా, కీసరి నాగయ్య, సందీప్, వెంకటరమణ, అంజనేయులు, సైదులు, యడ్ల అంజిరెడ్డి, కడియాల అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని చీదెళ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీ గుర్రం అమృతారెడ్డి, పీఏసీఎస్ నారాయణగూడెం మాజీ అధ్యక్షుడు సూదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పొట్లపహాడ్ మాజీ సర్పంచ్ నారాయణ సునీతశ్రీధర్‌రెడ్డి, చీదెళ్ల ఉపసర్పంచ్ గోపిల ఆధ్వర్యంలో 500మంది బీఆర్ఎస్ కార్యకర్తలు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరారు.

పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం : కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), మే 11: పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. ఈవీఎంలు భద్రపరిచే గోదాముల్లో స్ట్రాంగ్ రూంలను ఎన్నికల సాదారణ పరిశీలకులు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ తో కలిసి శనివారం తనిఖీ చేశారు. పార్లమెంట్ పోలింగ్ పూర్తయిన తర్వాత పోలింగ్ ఈవీఎంలను 14వతేదీ మద్యరాత్రి ఉదయం 1గంటల వరకు నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లిలో ఏర్పాటు చేసిన ఈవీఎం గోదాం స్ట్రాంగ్ రూంకు తరలించాలని సూచించారు. ఈనెల 13వతేదీన ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుండి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలను పంచించామని తెలిపారు. నేడు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ల నుండ ఆయా పోలింగ్ స్టేషన్‌లకు ఎన్నికల సిబ్బందితో పాటు ఈవీఎంలు చేరుకుంటాయని తెలిపారు. జిల్లాలో 1201 పోలింగ్ కేంద్రాలుఏర్పాటు చేశామని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 229 ఉన్నాయని అలాగే 112 రూట్లల్లో 123 సెక్టార్ అధికారులను నియమించామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు వేణుమాదవ్, శ్రీనివాస్, సూర్యనారాయణ,శ్రీనివాస్, భూమన్న పాల్గొన్నారు.

తుంగతుర్తి: ఓటర్లందరూ స్వేచ్ఛ వాతావరణంలో తమ ఓటటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ జీఎస్ లత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల నుంచి సిరి ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎండ వేడి లేకుండా టెంట్లు, తాగునీరు కల్పించామన్నారు. అంగవైకల్యం ఉన్న ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.



ఈవీఎంల భద్రతను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

మోతె: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని హుస్సేనాబాద, మోతె, నామవరం గ్రామాల్లో శనివారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ప్రతి బూత్‌లో ఓటర్లకు సంబంధించిన ఓటరు లిస్టులో వివరాలు అందుబాటులో ఉంచాలి. సీసీ కెమెరాలు, మంచినీటి సౌకర్యం, పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్‌నాయక్, మండల ప్రత్యేకాదికారి సీతారాములు ఉన్నారు.

మునగాల రూరల్: పోలింగ్‌ను సమర్ధవంతంగా నిర్వహించాలని మండల ఎన్నికల ప్రత్యేకాదికారి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కె. జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బరాఖత్‌గూడెం, గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి, మాధవరం, మునగాల గ్రామాల్లో శనివారం పర్యటించారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్, ఆర్ఐ రాధా తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మునగాల రూరల్, అనంతగిరి, మే 11: అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజల చెంతకు చేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు గడ్డం లక్ష్మీనారాయణ అన్నారు. బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని నారాయణగూడెంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంబాబుగౌడ్, నాగిరెడ్డి, ఎంపీటీసీ రోశయ్య, సోమిరెడ్డి వీరారెడ్డి, గడ్డం లింగయ్య, లచ్చిరెడ్డి, సైదులు, వెంకన్న, గోపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతగిరి మండలంలోని వెంకట్రాంపురంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేవల్లె కృష్ణాకొరటం, ఐతనబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి

కోదాడటౌన్, మే 11: విద్యార్థులకు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, డాక్టర్ అభిరామ్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. పిల్లలకు కథలతో ఆటపాటల ద్వారా వాటి వల్ల అనర్థాలు వివరించారు. సైన్స్ కిట్ మ్యాథమెటిక్స్ కిట్ డ్రాయింగ్ కిట్ ఫస్ట్ ఎయిడ్ కిట్ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే. జాఫర్, ఎంఈవో సలీంషరీఫ్, శేష బ్రహ్మం, తేజ టాలెంట్ జానకి రామయ్య, ఎస్. రమేష్, రాజశేఖర్, దుర్గాప్రసాద్, హనుమంతరావు, ఆర్. రామ నరసయ్య, బి. సైదులు, స్వామి, కృష్ణమూర్తి, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, మే 11: అనారోగ్య కారణాలతో మతిస్థిమితం కోల్పోయి చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన జిల్లాకేంద్రంలో శనివారం జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బాలాజీనగర్‌కు చెందిన మోతె శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య రమాదేవి(48) ఇంటివద్దే ఉంటుంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. వారందరికీ వివాహాలు జరిపించారు. పిల్లలందరూ విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. కాగా ఇటీవల వీరి చిన్న కుమార్తె కుటుంబ విషయంలో తగాదాలు జరిగి విడాకులు తీసుకుంది. అప్పటినుంచి రమాదేవి చిన్న కుమార్తె విషయంలో జరిగిన తగాదాలను తలుచుకుంటూ మనోవేదనతో అనారోగ్యానికి గురైంది. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి జిల్లాకేంద్రంలోని సద్దుల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు రమాదేవి గురించి వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం 8గంటల సమయంలో రమాదేవి మృతదేహం సద్దుల చెరువులో తేలగా స్థానికులు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు చెరువు వద్దకు చేరి మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. రమాదేవి సోదరుడు కస్తూరి వీరేందర్ ఫిర్యాదు మేరకు కేసే నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఆత్మకూర్(ఎస్), కోదాడ రూరల్, మే 11: ఆత్మకూర్(ఎస్), కోదాడ మండలాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని రామన్నగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కాశీగూడేనికి చెందిన షేక్ సైదా(32) పనినిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం రాత్రి తిరిగి బైక్‌పై వచ్చే క్రమంలో మండలపరిధిలోని కోటినాయక్‌తండా వద్ద దంతాలపల్లి నుంచి సూర్యాపేట వెళ్లే ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. సైదా తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సైదా తల్లి షేక్ బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ సైదులు తెలిపారు. సైదాకు భార్య, కుమారుడు ఉన్నారు. అదేవిధంగా కోదాడ మండలంలోని దోరకుంట గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. అనంతగిరి మండలం రంగాయిగూడెం గ్రామానికి చెందిన యర్రం వీరబాబు(45) తన భార్య రజినీని తీసుకుని టీవీఎస్ ఎక్సెల్‌పై దోరకుంటలో ఉన్న తమ బంధువుల ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో దోరకుంట గ్రామశివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతిచెందినట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కాగా అతని భార్య రజినీకి స్వల్ప గాయాలయ్యాయని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోదీని మళ్లీ ప్రధాని చేయాలి : అన్నామలై

సూర్యాపేట(ఆంధ్రజ్యోతి), సూర్యాపేట సిటీ, మే 11: దేశ సమగ్రాభివృద్ధి జరగాలంటే మోదీని మూడోసారి ప్రధాని చేయాలని తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కుటుంబానికి చెందిన పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో కేవలం ఒకటి మాత్రమే అమలు చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక కుటుంబం అవినీతికి పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక మంది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. నల్లగొండ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపిస్తే రూ.3వేల కోట్లు నల్లగొండ పార్లమెంట్ అభివృద్ధికి తీసుకువస్తారన్నారు. ఆరు లేన్ల జాతీయ రహదారి, ఇరువైపులా సర్వీస్‌రోడ్లు, హైదరాబాద్ నుంచి విజయవాడకు సూర్యాపేట మీదుగా రైల్వేలైన్ తీసుకొస్తామన్నారు. నిరుద్యోగుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, డ్రైపోర్టులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాని అనుకూలంగా ఉన్నారన్నారు. తమిళనాడు బీజేపీ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ టక్కుటమార గోకర్ణ విద్యలతో సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, పొలగాని ధనుంజయ్‌గౌడ్, చల్లమళ్ల నరసింహ, కర్నాటి కిషన్, జుట్టుకొండ సత్యనారాయణ, చల్లా శ్రీలతరెడ్డి, సలి గంటి వీరేందర్, శశిధర్‌రెడ్డి, కాంత్రిరెడ్డి, మల్సూర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అన్నామలై

అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు : ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి, మే 11: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలం తిమ్మాపురం గ్రామానికి బీఆర్ఎస్‌కు చెందిన వంద కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. గోదావరి జలాలు తెచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి తుంగతుర్తి నియోజకవర్గం నుంచి లక్ష మెజార్టీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, రత్నం లక్ష్మాజీ, మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, సురేష్, ఉప్పల య్య, బొడ్డు వెంకన్న, సంతోష్, జ్యోతుల మల్లయ్య, నిమ్మల కోటి కిరణ్, అన్నపూర్ణ, యాగయ్య, నాగరాజు పాల్గొన్నారు.

మద్దిరాల: భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లుయాదవ్ అన్నారు. మండలంలోని పోలుమళ్ల, చందుపట్ల, గోరెంట్ల గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేసు లింగయ్య, అమృతమల్లు, పచ్చిపాల వెంకన్న, బొబ్బిలి వెంకన్న, తాళ్లపల్లి సురేష్, ఉపేందర్, రమేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సామేల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కార్యకర్తలు

ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

మేళ్లచెర్వు, మే 11: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కేంద్ర, సాయుధ బలగాలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. కేంద్ర బలగాల సిబ్బందితో మండలకేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల అధికారులకు రక్షణ కల్పించాలని పోలింగ్ కేంద్రాల వద్ద ప్లకార్డులు, పార్టీ జెండాలు, పార్టీ గుర్తులు లేకుండా చూడాలని, పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరం, ఇతరులను అనుమంతించకూడదని కేంద్రంలో ఏదైనా సమస్యలు ఏర్పడితే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని అన్నారు. అదేవిధంగా మండలంలోని రామాపురం, ఏపీలోని బూదవాడ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నిఘా పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీరరాఘవులు, సీఐలు, రంజితారెడ్డి, చలమంద రాజు, ఎస్ఐ పరమేష్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో శనివారం జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,500 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, వీరరాఘవులు, చరమందరాజు, రజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటక్రైం: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించి పూర్తిచేస్తామని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలకు లోబడి జిల్లాలో రక్షణపోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీసు సిబ్బందికి సహాయంగా 1100 మంది తమిళనాడు రాష్ట్ర హోంగార్డ్స్, అరుణాచల్‌ప్రదేశ్ పోలీస్, 6కంపెనీల కేంద్ర సాయుధ బలగ సిబ్బంది అందరూ సుమారు 3500 మంది పోలీసులు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబందించి 11వతేదీ సాయంత్రం 5గంటల వరకు రాజకీయ పార్టీలకు ఇచ్చిన ప్రచార సమయం ముగిసిందని ఎవరూ కూడా ప్రచారం చేయవద్దన్నారు. సామాజిక మాద్యమాల్లో వాట్సప్, ఫెస్‌బుక్‌వంటి వాటిల్లో ప్రచారం చేయవద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.2కోట్ల 75లక్షల నగదు, రూ.18లక్షల విలువ గల మద్యం, రూ.35 వేల విలువైన గంజాయి, కోటి 18లక్షల విలువగల ఆభరణాలు, కోటి 4లక్షల విలువ గల ఇతర వస్తువులు సీజ్‌చేశామన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కోటి 74 లక్షల విలువైన మద్యం సీజ్ చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ రూ.6.18కోట్లు ఉంటుందని తెలిపారు.



మేళ్లచెర్వులో కేంద్ర బలగాలతో ఎస్పీ రాహుల్ హెగ్డే

కోదాడటౌన్: పోలీసులు ఓటర్లతో మర్యాదగా ప్రవర్తించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. పట్టణంలోని తమిళనాడు హోమ్ గార్డ్స్‌కు అరుణాచల్ ప్రదేశ్ సాయుధ సిబ్బందికి సీఐ, ఎస్ఎఫ్, సిబ్బందికి ఎన్నికల రోజు విధులపై దిశా నిర్దేశం చేసి మాట్లాడారు. పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్లు అనుమతించొద్దు ఎన్నికల సామాగ్రికి, ఎన్నికల సిబ్బందికి ఓటర్లకు భద్రత కల్పించడం పోలీసు విధి అన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.